
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 కనిష్ఠం 26.3
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 15 ఆగస్టు 2024



రైల్వే లైన్‌పై చిగురిస్తున్న ఆశలు





- ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వేలైన్‌కు సానుకూలత
- నిర్మల్ మీదుగా ఇప్పటికే సర్వే పూర్తి
- తాజాగా పార్లమెంట్‌లో ఎంపీ రఘునందన్‌రావు చొరవ
- రైల్వే మంత్రిని కలిసిన ఆదిలాబాద్ ఎంపీ నగేష్

నిర్మల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గడిచిన మూడు దశాబ్దాలుగా ప్రతిపాదనల్లో ఉన్న ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వేలైన్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇప్పటికే నిర్మల్ మీదుగా రైల్వే లైన్ పనులు పూర్తి అయిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పార్లమెంట్ సమావేశాల్లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఈ రైల్వేలైన్ విషయాన్ని తెరపైకి తెచ్చారు. దశాబ్దాల తరబడి తరబడి వేచి చూస్తున్న రైల్వే లైన్ కోసం నిధులు విడుదల చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కొత్తలైన్ నిర్మాణం పనులు పరిశీలిస్తామని కేంద్రమంత్రి హామీనిచ్చిన నేపథ్యంలో ఆశలు చిగురిస్తున్నాయి.

దశాబ్దాలుగా ఎదురుచూపులు

ఆర్మూర్ - నిర్మల్ ఆదిలాబాద్ రైల్వేలైన్ వ్యవహారం దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉంది. గతంలో రూ. 50 కోట్లు మంజూరు కాగా ఆ నిధులతో సర్వే పనులు జరిగాయి. అయితే నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ దాక రైల్వేలైన్ పనులు రెండు వైపులా నుంచి సర్వే చేసినట్లు ప్రచారం ఉంది. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి వెంబడి రైల్వేలైన్ వేస్తారని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే మళ్లీ ఈ రైల్వే లైన్ కొత్త దారి గుండా వేసేందుకు సర్వే జరిగినట్లు కూడా అధికార వర్గాలు చెబుతున్నాయి. సోన్, మంజులాపూర్, చించోలి మీదుగా రైల్వే లైన్ సర్వే పనులు జరిగినట్లు కూడా చెబుతున్నారు. ఇప్పటిదాక దీనిపై స్పష్టత లేదు. అయితే మళ్లీ రైల్వేలైన్ ఏర్పాటు వ్యవహారం తెరపైకి వస్తున్న నేపథ్యంలో రైల్వే మార్గం ఎటువైపు నుంచి వేస్తారన్నది త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

తాజా ప్రతిపాదనలతో మళ్లీ ఆశలు

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రైల్వేలైన్ వ్యవహారం ఈ సారి ఖచ్చితంగా తెలుతుందని జిల్లా వాసలు ఆశతో ఉన్నారు. నిర్మల్ రైల్వేలైన్ సాధన సమితి పేరుతో ఢిల్లీస్థాయిలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ఆదిలాబాద్ ప్రాంత వాసులకు కూడా నిర్మల్ మీదుగా రైల్వేలైన్ కోసం ఒత్తిడి చేస్తున్నారు. అయి తే తాజా పార్లమెంట్ సమావేశాల్లో ఈ రైల్వేలైన్ ప్రతిపాదనపై ఎంపీ రఘునందన్‌రావు గట్టిగా విజ్ఞప్తి చేయడంతో కేంద్రం సానుకూల స్పందన ఇచ్చినట్లు చెబుతున్నారు. మరోవైపు ఆదిలాబాద్ ఎంపీ నగేష్ రైల్వే లైన్ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ నగేష్ స్పష్టం చేశారు. తాజా ప్రతిపాదనలు చూస్తే ఈ బడ్జెట్ లోనే రైల్వే లైన్ పనులకు నిధులు మంజూరు అవుతాయ ని జిల్లా ప్రజలు ఆశతో ఉన్నారు. ఈ రైల్వే లైన్ పూర్తి అయితే మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వాణి జ్య పరమైన సంబంధాలు మెరుగుపడతాయని జిల్లా వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన ఆదిలాబాద్ ఎంపీ నగేష్ (ఫైల్)



హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభం



శాంతినగర్ హనుమాన్ ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న పండితులు

ఖానాపూర్, ఆగస్టు 14 : పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని అతిపురాతన హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు నిమ్మగడ్డ నాగరాజు, చంద్రశేఖర్‌శర్మ, ఖానాపూర్ వైదిక బృందం ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, నవగ్రహాల పూజ, అఘోర హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆలయంలో పలు విగ్రహాలను కదిలించారు. కార్యక్రమంలో వేద పండితులు మూర్తి, విష్ణుబోట్ల రాజశేఖర్ శర్మ, శరత్‌చంద్ర, వెంకటేష్ శర్మ, మున్నా, ఆలయ అధ్యక్షుడు కే. నాగేందర్, అంకం రాజేందర్, బీసీ రాజన్న, పుప్పాల శేఖర్, సాడిగే రమణ, కతులపురం గంగనర్సయ్య, ఏ. రంజిత్, రమేష్, అంకం నాగరాజు, తదితరులున్నారు.

పొన్కల్ కొత్త చెరువులో సత్యనారాయణ స్వామి వ్రతం



పొన్కల్ కొత్త చెరువులో సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న గ్రామస్థులు

మామడ రూరల్, ఆగస్టు 14 : మండలంలోని పొన్కల్ గ్రామంలోని కొత్త చెరువులో బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేసుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని స్వామిని వేడుకున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన పాయసాన్ని చెరువులో కలిపారు. ప్రతీఏటా ఆనవాయితీగా ఈ వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పంటలు వేసే ముందు స్వామివారికి మొక్కు తీర్చుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

30 పోలీస్ యాక్ట్ ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు

దిలావర్‌పూర్, ఆగస్టు 14 : 30 పోలీస్ యాక్ట్‌ను ఉల్లంఘించిన 22 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. జిల్లాలో పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో దిలావర్‌పూర్‌కు చెందిన కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా బస్టాండ్‌లో గుమిగూడి ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు సమాలోచనలు చేస్తుండటంతో పాటు కలెక్టరేట్‌కు గుంపుగా వెళ్లడంతో పోలీస్ 30 యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కొనోకార్పస్ చెట్లు తొలగించండి : బీఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 14 : నిర్మల్ పట్టణంతో పాటు పలుచోట్ల రోడ్డు డివైడర్ల మధ్య గల కొనోకార్పస్ చెట్లు తొలగించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి డి. జగన్మోహన్ కోరారు. బుధవారం విలేకరుతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం సుందరీకరణలో భాగంగా ఈ చెట్లు ఏర్పాటు చేశాయని అది ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని పరిశోధకులు తెలియజేశారన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

- విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపణ
- భైంసా - బాసర రహదారిపై బైఠాయించి రాస్తారోకో
- ట్రాన్స్‌కో డీఈఈ హామీతో సద్దుమణిగిన సమస్య



రోడ్డుపై ఆందోళన చేస్తున్న దృశ్యం.. (ఇన్‌సెట్‌లో ముగ్దుమ్ మృతదేహం)

ముథోల్, ఆగస్టు 14 : మండలంలోని న్యూ పిప్రి గ్రామానికి చెందిన ముగ్దుమ్(45) అనే వ్యక్తి మంగళవారం రాత్రి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. మృతుడి ఇంటిలో విద్యుత్ అంతరాయం కలగడంతో ఎల్‌సీ కొరకు సంబంధిత ట్రాన్స్‌కో శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన స్పందించకపోవడంతో కర్ర సహాయంతో విద్యుత్ స్తంభానికి ఉన్న వైరును కదిలించాడు. అయితే ఆ విద్యుత్ స్తంభానికి ఆనుకొని వేలాడుతున్న సపోర్ట్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో ఆ వైరు తగిలి ముగ్ధమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామంలో విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉన్నాయని పలుమార్లు తెలిపిన పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. మృతుడికి న్యాయం చేయాలని బుధవారం మృతుడి కుటుంబ సభ్యులు, పిప్రి గ్రామస్థులు భైంసా - బాసర ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటపాటు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ మల్లేష్, ముథోల్, బాసర ఎస్సైలు సాయి కిరణ్, గణేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. అయితే ట్రాన్స్‌కో స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు జరిగేది లేదని భీష్మించారు. దీంతో ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి వచ్చి మృతుడి కుటుంబంకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన కారులు శాంతించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

స్త్రీనిధి అమలులో నిర్మల్‌కు ద్వితీయ స్థానం



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 14 : తెలంగాణ రాష్ట్రంలో స్త్రీనిధి పేదల పెన్నిధి పథకం అమలులో నిర్మల్ జిల్లా ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నుంచి నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందుకున్నారు.

అన్నబాహూ సాఠే జయంతిని అధికారికంగా నిర్వహించాలి

తానూర్ , ఆగస్టు 14 : పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కను బుధవారం ముథోల్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో పాటు అన్నబాహూ సాఠే క్రాంతి సేన తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు కలిసారు. హైదరాబాద్‌లోని సెక్రటరియట్‌లో ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్రంలో అన్నబాహూ సాఠే జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరినట్లుగా అన్నబాహూసఠే క్రాంతి సేన ఫోర్స్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఉత్తం భలేరావు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో సాహిత్యాలు రాసి ప్రజలను ఉత్తేజ పరిచారని, ముంబై నగరం కోసం పోరాటం చేశారని, శివాజీ మహరాజ్ జీవిత చరిత్రను ఎన్నో కదంబరులు రాసి విదేశాల్లో తన చరిత్రను తెలిపిన మహనీయుడు అన్నబాహుసాఠే అని, ఆయనకు భారతరత్న ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి లెటర్ రాయాలనీ కోరినట్లుగా తెలిపారు. దీనికి మంత్రిసీతక్క సానుకూలంగాస్పందించి సీఎం దృష్టికి తీసుకెవెళ్లానని చెప్పినట్లు గా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాశెట్టి రాజన్న, ఆనంద్‌రావుపటేల్, మంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు తులసీదాస్, చంద్రశేఖర్‌పటేల్, గోనే గజ్జారాం, ఏబీఎస్ ఉపాధ్యాక్షులు గణపతి, డైరెక్టర్ శంకర్, సురేఖబాయి తదితరులున్నారు.



మంత్రి సీతక్కతో అన్నబాహుసాఠే క్రాంతి సేన కమిటీ సభ్యులు

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



ముథోల్, ఆగస్టు 14 : హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా బుధవారం ముథోల్ నియోజకవర్గ తెలంగాణ జన సమితి పార్టీ ఇన్‌చార్జి సర్దార్ వినోద్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు బీటీ రోడ్లు, బ్రిడ్జిలు, అంగన్‌వాడీ భవనాలు, పలు పాఠశాలల భవనాలు, ప్రహరీ గోడలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 14 : భైంసా పట్టణం శాంతినగర్‌కు చెందిన నగేష్ తాపీ మేస్త్రీపై సుభాష్ నగర్‌కు చెందిన శంకర్ అనే మరో తాపీ మేస్త్రీ గొడవపడి హత్యాయత్నానికి యత్నించినట్లు నేరం రుజువు కావడంతో నిర్మల్ సబ్ కోర్టు న్యాయాధికారి డి. రాధిక బుధవారం నిందితుడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయ అధికారి దశ్యసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఘటన 2022 డిసెంబరు 4న రాత్రి 9 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. తెల్లకల్లు బట్టి వద్ద నిందితుడు గొడవపడి నగేష్‌పై దాడి చేసి కత్తితో కడుపులో పొడిచాడని తెలిపారు. అక్కడే ఉన్న భోజరామ్ అనే వ్యక్తితో పాటు బాధితుడి తమ్ముడు 10 వాహనంలో భైంసా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అప్పటి ఎస్సై హన్మండ్లు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. రమణారావు 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారించగా నేరం రుజువైందని తెలిపారు.

ఇథనాల్ పరిశ్రమతో ఇబ్బందులు కలగకుండా చూస్తాం : కలెక్టర్

దిలావర్‌పూర్, ఆగస్టు 14 : దిలావర్‌పూర్ ప్రాంతంలో ఇథనాల్ పరిశ్రమ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ హామీ ఇచ్చారు. బుధవారం దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్థులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఫ్యాక్టరీ నిర్మాణ ప్రదేశంలో ఆర్డీవో, తహసీల్దార్ బృందం దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

'స్వాతంత్ర్య' వేడుకకు ఎస్ఎఫ్‌సీ చైర్మన్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించనున్న 78 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉదయం 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ తదనంతరం గౌరవవందనం, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించనున్నారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

తలమడుగు, ఆగస్టు 14 : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్టు శ్రీకాంత్ అన్నారు. తలమడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రెస్, నేషనల్ సర్వీస్ స్కీమ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అదిరోహిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కష్టమైన లక్ష్యలను ఏదైనా చేరుకునేలా ప్రయత్నించాలని సూచించారు. పరీక్షలు అంటే భయం వదిలేసి ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలను చదువుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవరావు, కళాశాల లెక్చరర్ రమేష్, సూర్యకాంత్, లింగన్న, కృష్ణ, విద్యార్థులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

తలమడుగు, ఆగస్టు 14: తలమడుగు కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం పర్యటనలో భాగంగా తలమడుగు మండలం రుయాడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తుందన్నారు. రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు నిబంధనలు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. లక్షా యాభై వేలు చేసిన రుణమాఫీలో 40 శాతం మందికి ఇంకా రుణమాఫీ కాలేదన్నారు. రుణమాఫీ కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ ఒకేసారి చేసి రైతుల సెల్‌ఫోన్‌లో ఓటింగ్‌అంటూ మెసెజ్‌లు వచ్చాయన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం మెసెజ్ వచ్చిన రుణమాఫీ కావడం లేదన్నారు. అంతేకాకుండా మహిళలకు నెలకు 2,500 ఇస్తానని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. కరెంట్ కష్టాలు తప్పడం లేదన్నారు. అనంతరం తాంసి, తలమడుగు మండలాల ఆయా గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు రూ. 6 లక్షల 80 వేలు విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు. అనంతరం రుయాడి గ్రామానికి చెందిన గోక సంజీవరెడ్డి అనే రైతు ఎడ్లబండిపైనే గుండెపోటుతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబ సభ్యులకు హామీనిచ్చారు. ఇందులో ఖానాపూర్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, జిల్లా నాయకులు పిడుగు అభిరామ్‌రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, ఎలుగు ప్రేమేందర్, సుదర్శన్‌రెడ్డి, అబ్దుల్లా, గంగాధర్, రంజిత్‌రెడ్డి, రమాకాంత్, చంటి, ప్రకాష్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 14: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక,కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడు కుందామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండిదత్తాత్రి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. బుధవారం కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో నిరసన తెలపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక, కర్షకులు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తు కార్పొరేటర్లకు అనుకూలంగా పాలన సాగిస్తుందన్నారు.క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో కార్మిక, ప్రజాహక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపుని చ్చారు. ప్రజాస్వామ్యహక్కులను కాపాడుకోవడానికి ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కార్మిక, వ్యవసాయ సంఘాల నాయకులు అగ్గిమల్ల స్వామి, ఆశన్న, పాల్గొన్నారు.

'నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి'

తలమడుగు, ఆగస్టు 14: నిరంతర విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని ఏఈ సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామీణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా విద్యుత్ వినియోగదారులు, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కొత్తూరు గ్రామంలో కరెంట్ లేదనే అవాస్తవన్నారు. మంగళవారం డిపార్టుమెంట్‌కు సాయంత్రం సుమారు 6 గంటల ప్రాంతంలో కొత్తూరు గ్రామంలో కరెంట్ లేదని ఫోన్ రావడం జరిగిందని, మేము వెంటనే వెళ్లి లైన్ చెక్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చూడగా దాని యొక్క బ్రేకర్ ట్రిప్ అయి ఉందని, వెంటనే ట్రిప్ అయిన బ్రేకర్ ఆన్ చేసి 7.30 గంటల ప్రాంతంలో సప్లై పునరుద్దరణ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 14: అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాలో పని తీరును పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ ఫణిదర్, ఎస్సై ముజాహిద్ పాల్గొన్నారు.

వాహనాల నుంచి పెట్రోల్ చోరీ

బోథ్, ఆగస్టు 14: మండలకేంద్రంలో రాత్రిపూట ఇంటి బయట నిలిచి ఉంచిన ద్విచక్ర వాహనాలు నుంచి పెట్రోల్ చోరీకి గురి అవుతుండటంతో వాహనదారులు ఆందోళన చేస్తున్నారు. రాత్రిపూట నిలిపి ఉంచిన వాహనాల నుంచి వాటర్ బాటిళ్లలో నింపుకునరి వెళ్లి బయట విక్రయిస్తున్నారని వాహన యజమానులు అంటున్నారు. రాత్రిపూట పోలీసు అధికారులు నిఘా పెంచాలని కోరుతున్నారు.

విగ్రహాలను శుద్ధి చేసిన బీజేపీ నాయకులు

బోథ్, ఆగస్టు 14: ప్రధానమంత్రి నరేంద్రమోది ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం బీజేపీ నాయకులు బోథ్ బస్టాండ్‌లో విగ్రహాలను శుద్ధి చేశారు. మండల పార్టీ కన్వీనర్ బోరే రవీందర్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ కార్యక్రమం దక్షిణమధ్య రైల్వే బోర్డు సభ్యులు జి.వి.రమణతో పాటు సీనియర్ నాయకులు డాక్టర్ అశోక్‌రెడ్డి, జక్కుల వెంకటేష్, మాజీ మండల కన్వీనర్ సుభాష్, సూర్య, బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులుతో పాటు పలువురు విగ్రహాలను శుద్ధి చేశారు. ఈ సందర్భంగా భారతదేశ స్వాతంత్ర పోరాటంలో మహానీయుల పాత్ర కీలకమని వారిని ఎన్నడూ మరిచిపోవద్దని వారు పేర్కొన్నారు. దేశం కోసం వారు చేసిన ఎంతో గొప్పదన్నారు. ప్రాణ త్యాగాలు చేసి దేశ ప్రజలకు స్వేచ్ఛ భారతాన్ని అందించారన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాల విద్యార్థులకు నాగభూషణం పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలు చేత పట్టుకుని మానవహారంగా నిల్చుని అమరులైన వారిని కీర్తిస్తూ జోహార్లు అర్పించారు.

ఆరోగ్య మిత్రులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బోథ్, ఆగస్టు 14: గత 17ఏళ్ల కాలంలో ఆరోగ్యశ్రీ పథకంలో పని చేస్తున్నారు. ఆరోగ్య మిత్రులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆరోగ్య మిత్ర లు స్థానిక ఎమ్మెల్యే అనిల్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో ప్రకారం తమకు 22,750 వేతనంగా ఇవ్వాలని కోరారు. అంతేగాక రాబోయే పీఆర్‌సీలో తమ వేతనాన్ని 35 వేలుగా అందించాలని కోరారు. 16 సంవత్సరాలుగా పని చేస్తున్న వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే విధంగాచూడాలని వారు కోరారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎం.గంగామణి, ధరమ్‌సింగ్, ఉలుమాస్, రజిని, గోదావరి, దత్తు, తదితరులు ఉన్నారు.

రిమ్స్‌లో విధులు బహిష్కరించిన జూడాలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 14: పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆదిలాబాద్ రిమ్స్‌లోని జూడాలు సాధారణ విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకే రక్షణ లేకుండా పోయిందని ఆదిలాబాద్ రిమ్స్ జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షులు సందీప్ చారి అన్నారు. కోల్‌కతాలో జూనయర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను ఖండిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఓపీ సేవలను రిమ్స్ జూనియర్ డాక్టర్లు బహిష్కరించారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల వద్ద నిరసన తెలిపారు. జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఉట్నూర్, ఆగస్టు 14: పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఆర్థికంగా ఎంతగానో దోహద పడుతుందని ఖానాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో 16 మంది లబ్దిదారులకు రూ.5.51లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పథకం వల్ల పేద ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఆపద సమయంలో రోగి ఆపరేషన్ చేసుకోవడానికి అయ్యే ఖర్చును సీఎంఆర్ఎఫ్ (ఎల్ఓసీ)లను అందించి తద్వారా మెరుగైన వైద్య సేవలు చేసుకొనే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం సంజీవినిలా పని చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

వడ్గల్‌పూర్ గ్రామస్థుల హర్షం

మండలంలోని వడగల్పూర్(కె) గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో గ్రామస్థులు హర్షం ప్రకటించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్‌ను వడగల్పూర్ (కె)నూతన గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల పటేల్లు, గ్రామస్థులుమర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అంద జేశారు. తమ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ధనసరి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపటేళ్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ పరిరక్షణలో మొక్కలది కీలకపాత్ర

బోథ్, ఆగస్టు 14: పుట్టిన రోజు ఆర్భాటాలకు పోకుండా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని యూ టర్న్ పాఠశాల కరస్పాండెంట్ పాఠశాలలో చదివే విద్యార్థి షేక్ అలీ కుమారుడైన అశిక్ అలీ పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కార్తీక్, ప్రిన్సిపాల్ అల్లం సాయి కృష్ణ, ఉపాధ్యాయులు గురుమూర్తి, రవితేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

దస్తురాబాద్ రూరల్, ఆగస్టు 14 : పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 11 మంది లబ్ధిదారులకు రూ. 3,30,000ల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ పథకం వల్ల పేద ప్రజలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఆపద సమయంలో పేషెంట్ ఆపరేషన్‌కు అయ్యే ఖర్చును సీఎంఆర్ఎఫ్ తక్షణ సహాయం కింద ఎల్‌వోసీ ద్వారా నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. ఆపదలో ఉన్న రోగులకు సీఎంఆర్ఎఫ్ పథకం సంజీవనిలా పని చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విపరీతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని, నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఇంటితో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో కే. రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గం మల్లేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

పొట్టపెల్లి రైస్ మిల్లులో 220 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని పట్టుకున్న రెవెన్యూ అధికారులు

లక్ష్మణచాంద, ఆగస్టు 14 : మండలంలోని పొట్టపెల్లి రైస్ మిల్లులో 220 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు రైస్ మిల్లుపై దాడి చేయగా ఒక వాహనంలో ఉన్న బియ్యంతో పాటు రైస్ మిల్లులో గల 220 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని నిర్మల్ గోదాంకు తరలించారు. రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి అక్రమంగా తరలించటం కోసం సిద్ధంగా ఉంచిన ఈ బియ్యాన్ని పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. రైస్ మిల్లుపై, వాహనంపై కేసు నమోదు చేసినట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ కార్తీక్‌రెడ్డి, విజిలెన్స్ సీఐ ప్రశాంత్ రావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న కుంటాల

● విజృంభిస్తున్న అంటువ్యాధులు

● పత్తాలేని పంచాయతీ అధికారులు



బస్టాండ్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు

కుంటాల, ఆగస్టు, 14 : ప్రభుత్వం ఓ వైపు పచ్చదనం.. స్వచ్ఛదనం పేరుతో గ్రామాల్లో పారిశుద్ధ్య నివారణకు చర్యలు తీసుకుంటుండగా కుంటాల మండలంలో అధికారులు తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. మండల కేంద్రం కుంటాలలో గత నెల రోజులుగా పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టకపోవడంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. పలు కాలనీల్లో మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ దోమల తిష్ట వేస్తుండడంతో స్థానికులు విషజ్వరాల బారిన పడుతున్నారు. గత వారం రోజులుగా కుంటాల మండల కేంద్రంలో సంబంధిత పంచాయతీ అధికారులు నామ్ కే వాస్తేగా పారిశుద్ధ్య నివారణ కార్యక్రమాలు చేపడుతూ ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుంటాలలో పందులు, కుక్కలు స్వైర్య విహారం చేస్తున్న పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.మండల స్థాయిలో ఎంపీడీవో, ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నివారణపై పర్యవేక్షణ జరపకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని ఫలితంగా రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారులు స్పందించి కుంటాలలో పారిశుద్ధ్యం పై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంటింటా మువ్వన్నెల జెండాను ఎగురవేసి

జాతీయ సమైక్యతను చాటుకుందాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్

భైంసా, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి జాతీయ సమైక్యతను చాటుకుందామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్ పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా పిలుపు మేరకు భైంసాలోని ప్రధాన ప్రాంతాల్లో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి పౌరుడు దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడేందుకు అంకితమవ్వాలని సూచించారు.యువత జాతీయత భావాలను పెంపొందించుకొని దేశ సేవకు బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్ సారథ్యంలో బీజేపీ శ్రేణులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను చేతపట్టి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ పరిధిలోని వ్యాపార సంస్థలకు, వీధి వ్యాపారులకు, పాదచారులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. .

ఘనంగా అఖండ భారత్ సంకల్ప దివస్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 14 : నిర్మల్ పట్టణం బుధవార్‌పేట్ చౌరస్తాలో బుధవారం అఖండ భారత్ సంకల్ప దివస్ కార్యక్రమాన్ని హిందూవాహిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూవాహిని నాయకులు మాట్లాడుతూ... అఖండ భారత నిర్మాణమే ధ్యేయంగా ఈరోజు అఖండ భారత సంకల్ప దివస్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ


నిర్మల్ కల్చరల్, ఆగస్టు 14 : మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం ఇటీవల మృతి చెందిన కొమ్ము రమేష్, పడిగెల ఇస్తారి కుటుంబాలను వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్లు ఇమ్రానుల్లా, ముజాహిద్ చావుస్, లక్కాకుల నరహరి, అన్వర్ పాషా, సాజిద్, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

'కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలి'

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 14 : 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య హాజరు కానున్నందున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు ఒక ప్రకటనలో శ్రేణులను కోరారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వేడుకలు జరుగనున్నాయన్నారు.

కల్లూర్ బంద్ ప్రశాంతం

కుంటాల, ఆగస్టు, 14 : బంగ్లాదేశ్ అల్లర్లకు నిరసనగా మండలంలోని కల్లూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా కొనసాగింది. లోకేశ్వరం, కుంటాల మండలాలకు ప్రముఖ వాణిజ్య కేంద్రమైన కల్లూర్‌లో వ్యాపారస్తులందరూ దుకాణాలను మూసి స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు.






హస్నాపూర్ పీహెచ్‌సీలో వైద్యం అందుకుంటున్న రోగులు



ఉట్నూర్ ఆసుపత్రిలో మూతబడ్డ ఐసీయూ



● ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి



● ఉట్నూర్ ఆసుపత్రిలో వైద్యం అందుకుంటున్న రోగులు

వెక్కిరిస్తున్న.. ఖాళీలు!

- ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంల్లో గల పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత
- అత్యవసర సమయాల్లో ఆదివాసీ గిరిజనులకు తప్పని తిప్పలు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలూ అంతంత మాత్రంగానే..
- ఉట్నూర్ జిల్లా ఆసుపత్రిలో పని చేయని ఐసీయూ
- గిరిజన ప్రాంతాల్లో పీహెచ్‌సీలకు 73 డాక్టర్ పోస్టులు మంజూరు ఉండగా.. విధుల్లో కేవలం 32 మంది మాత్రమే..
- ఆసుపత్రులకు పక్షం రోజుల్లో వైద్యులు : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



ఉట్నూర్, ఆగస్టు 14: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో మారుమూల గిరిజన గ్రామాల్లో ఉంటున్న గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సరైన డాక్టర్లు లేక పరిస్థితులు వెక్కిరిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏజెన్సీ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇద్దరేసి డాక్టర్లను నియమించడం ద్వారా ఒకరు పీహెచ్‌సీలో ఉంటే మరొకరు గ్రామాలలో పర్యటించి క్షేత్ర స్థాయిలో వైద్య శిబిరాలు పెట్టి వైద్య సేవలు అందిస్తారని భావించారు. దీని కోసం ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అదనపు ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును సమీక్షిస్తూ వస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఏర్పాటైన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో దశాబ్ద కాలంగా డాక్టర్ల కొరత కనిపిస్తోంది. అత్యవసర సమయాల్లో సరైన వైద్యం అందక ఆదివాసీ గిరిజనులకు తిప్పలు తప్పడం లేదు. కాగా, ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి డాక్టర్ అనురాధాను పీహెచ్‌సీకి బదిలీ చేశారు. అంతకు ముందే ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ రాంబాబును నార్నూర్ మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రికి డిప్యూటేషన్‌పై పంపించారు. హస్నాపూర్ జరి పీహెచ్‌సీ ఇన్‌చార్జీ బాధ్యతలను డాక్టర్ కోవ అనురాధాకే అప్పగించారు. ఇంద్రవెల్లి మండలకేంద్రంలోని డాక్టర్ శ్రీకాంత్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించ లేదు. అదేవిధంగా పిట్టబొంగారం, గాదిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా ఒక్కొక్కరే వైద్యులు ఉన్నారు.

నార్నూర్‌లో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో సీహెచ్‌సీ ఏర్పాటు చేసినప్పటికి ఐదుగురు డాక్టర్లు నియమించాల్సి ఉండగా.. ఒక్కరు కూడా లేకపోవడంతో ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దంతనపల్లి పీఎస్సీ డాక్టర్‌ను డిప్యూటేషన్‌పై పంపించారు. అంకోల్ పీహెచ్‌సీకి సన్రైజ్ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. సైదుపూర్, భీంపూర్(టి), గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, నర్సాపూర్(టి), బజార్‌హత్నూర్, జైనూర్ ఆసుపత్రికి నార్నూర్ డాక్టర్ జితేందర్‌రెడ్డిని ఇన్‌చార్జీగా నియమించారు. ఆయనే లింగాపూర్ పీహెచ్‌సీకి ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. సిర్పూర్(యు), కెరమెరి, అడ, తిర్యాని, రోంపల్లి, గినేదరి, ఇస్‌గాన్, లోన్‌వెల్లి, ఉషేగం, దండేపల్లి, తాళ్లపేట్, మందమర్రి, కాసిపేట్‌లలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇద్దరు వైద్యులకు బదులు.. ఒక్కొక్కరే డాక్టర్లు ఉన్నారు. కాగా, గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మొత్తం 73 డాక్టర్ పోస్టులు మంజూరు ఉండగా.. కేవలం 32 మంది మాత్రమే పని చేస్తున్నారు. బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నాలుగు డాక్టర్ పోస్టులు ఉండగా.. అక్కడ ఉన్న ఒక్క డాక్టర్‌ను గిమ్మకు డిప్యూటేషన్‌పై పంపించారు.

వైద్య సేవలు అంతంతే..

ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన వైద్యులు లేకపోవడంతో గిరిజన గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అంతంతమాత్రమే అందుతున్నాయి అంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఉట్నూర్ మండల కేంద్రంలో ఉన్న వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసి.. జిల్లా ఆసుపత్రిగా పేరు పెట్టారు. అయినప్పటికీ ఇక్కడ ఉన్న డాక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ముందే ఏజెన్సీ ప్రాంతాలలో పని చేయడానికి డాక్టర్లు రాకపోగా.. ఉన్న వారిని బదిలీ చేయడంతో ఉట్నూర్ ఆసుపత్రిలో రోగులకు సరైన వైద్యం అందించడం లేదు. ఇక్కడ ఉన్న స్త్రీ వైద్య నిపుణురాలు, మత్తు డాక్టర్, ఎండీ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, దంత వైద్యులు, ఎముకల డాక్టర్‌లు బదిలీ అయ్యారు. ఉట్నూర్ ఆసుపత్రిలో ఉన్న పిల్లల డాక్టర్ రాథోడ్ రవిని బోథ్ ఆసుపత్రికి ఇన్‌చార్జీగా నియమించారు. ఉమ్మడి జిల్లాలోని లింగాపూర్, సిర్పూర్(యు), జైనూర్, గాదిగూడ, ఝరి, నార్నూర్ మండలాల ప్రజలు వైద్యం కోసం ఉట్నూర్ ఆసుపత్రికి వస్తుంటారు. ఉట్నూర్ ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడంతో సీరియస్‌గా ఉన్న రోగులను ఇక్కడ సిబ్బంది జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు. అదేవిధంగా.. ఉట్నూర్ ఆసుపత్రిలో 17 డాక్టర్ పోస్టులకు గాను కేవలం ఏడుగురు మాత్రమే పని చేస్తున్నారు. దీనికి తోడు 14 మంది స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా.. కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. అదేవిధంగా జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా 18 మంది నర్సులను నియమించినప్పటికీ.. వారిని కూడా బదిలీ చేయడంతో ఉట్నూర్ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్న ఉన్న కొంత మంది సిబ్బందికి ఇబ్బందిగా తయారైంది.

ఐసీయూ ఉన్నా.. లాభం సున్న

ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో తేవడానికి ప్రభుత్వం కోటి రూపాయలతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) ఏర్పాటు చేసింది. అయినప్పటికీ వైద్యులు లేకపోవడంతో ఆధునిక పరికరాలు సైతం వినియోగంలో లేక మూలనపడుతున్నాయి. అంతేకాకుండా చెస్ట్ డాక్టర్, సాధారణ వైద్య నిపుణులతో పాటు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియోజాలిస్టులు, ఏఎన్ఎంలు, జీఎన్ఎంలు, నర్సుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఐసీయూ సేవలు జరగడం లేదు. ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంతాలలోని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఏజెన్సీలో వైద్య పోస్టుల ఖాళీల భర్తీకి కసరత్తు

: వెడ్మ బొజ్జుపటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే



ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యుల పోస్టుల భర్తీ కోసం తీవ్రంగానే ప్రయత్నం చేస్తున్నాం. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలిసి ఏజెన్సీ ప్రాంతాలలో డాక్టర్లను భర్తీ చేయాలని కోరడం జరిగింది. ఈ విషయమై వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ సైతం సానుకూలంగా స్పందించారు. త్వరలోనే డాక్టర్ పోస్టులు భర్తీ అవుతాయి.

నేడే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

● ముస్తాబైన పోలీసు పరేడ్ మైదానం



పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 14: జిల్లాలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాట్లు చేశారు. రంగురంగుల ముగ్గులతో పాటు స్టాళ్లను, ముఖ్య అతిథులు ఆసీనులయ్యే ఏర్పాట్లను పెద్దఎత్తున ముస్తాబు చేశారు. ముఖ్యంగా పరేడ్ మైదానంలో ముఖ్య అతిథి రాక కోసం రంగురంగులు వేసి మైదానాన్ని సిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంలు ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా ముఖ్య అతిథి గౌరవ వందనం, అనంతరం జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంతో పాటు విద్యార్థుల ఆట పాటలు, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలను అందజేయనున్నారు. అలాగే ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలను తెలియజేసే శకటాల ప్రదర్శనను నిర్వహించనున్నారు. ముందుగా పోలీసు పరేడ్ మైదానంలో ఉదయం 10గంటలకు నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్‌అలీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి పరేడ్ మైదానంలో అధికారులు పూర్తి బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు.



ఆదిలాబాద్‌లో ముస్తాబైన పరేడ్ మైదానం



అతిథుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 14: పారిశుధ్యం పనులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామంలో కలెక్టర్ రాజర్షిషా పర్యటించారు. దీనిలో భాగంగా గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద ప్లాట్ ఫాం, ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలని, ట్యాంక్ చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక అధికారుకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని, మెనూ ప్రకారం ఏ రోజుకారోజు అందించాల్సిన ఆహారాన్ని అందిస్తున్నారా? లేదా? పరిశీలించారు. కోడిగడ్లు చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందించాలని, మంచినీరు తాగి పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ గిరిజన శాటిలైట్ సెంటర్ పోతగూడను సందర్శించి స్టోర్ రూమ్, నీటి పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించారు. వంట గది పరిసరాలు, స్టోర్ రూమ్‌లోని సరుకులు, టాయిలెట్స్, పరిశుభ్రంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలోని సమస్యలను గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సూర్యకాంత్, ఎంపీడీవో, ఎంపీవో, డీటీ, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, సీడీపీవో, సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మాదకద్రవ్యాల వల్ల అనేక నష్టాలు : జిల్లా అధికారి

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 14: మాదక ద్రవ్యాల వల్ల అనేక నష్టాలున్నాయని, వాటిని గురించి విద్యార్థి దశ నుంచే తెలుసుకుని దూరంగా ఉండాలని జిల్లా సంక్షేమ అధికారి సబిత అన్నారు. బుధవారం జిల్లా సంక్షేమ శాఖ, వయోవృద్ధుల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో నవ ముక్త భారత్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాత హౌజింగ్ బోర్డులోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన జిల్లా సంక్షేమ అధికారిణి సబితను సన్మానించారు. మత్తు పదార్థాల వల్ల అనేక నష్టాలు కలుగుతాయని డీడబ్ల్యూవో సబిత అన్నారు. విద్యార్థి దశ నుంచే వీటి గురించి తెలుసుకుంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్తులో మత్తు పదా ర్థాలకు అలవాటు పడకుండా ఉన్నత చదువులు చదివి రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వయో వృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, చల్ల విజయ్‌బాబు, రాంకులకర్ణి, సత్య నారాయణ, కిషన్, బండారి దేవన్న, హన్మంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి : జడ్పీ సీఈవో

తలమడుగు, ఆగస్టు 14: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా పరిషత్ సీఈవో కలిందిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయ పాలన పాటించాలని ఆదేశించారు. విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రిజిష్టర్‌ను పరిశీలించి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సుంకిడి గ్రామంలో గల పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సుంకిడి గ్రామంలో గల పల్లె ప్రకృతివనం, నర్సరీలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పల్లె ప్రకృతి వనం బాగుందని, మాజీ సర్పంచ్‌తో పాటు స్థానిక గ్రామ పంచాయతీ సెక్రెటరీలను అభినందించారు. ఇందులో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ రాజమోహన్, సూపరింటెండెంట్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ నగేష్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో కలిందిని